అభివృద్ధి పనులకు శ్రీకారం

- 27వ వార్డులో రూ.20లక్షలతో యూజీడీ పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వాసుపల్లి
- 33, 32 వార్డుల్లో సీసీ డ్రైనేజీల మరమ్మతులు
- 35వ వార్డులో జీవీఎంసీ కార్యాలయ అభివృద్ధికి భూమి పూజ



27వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



జనతాబజార్ వద్ద వార్డు కార్యాలయ అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి



33వ వార్డు నీలమ్మవేపచెట్టు వద్ద సీసీ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సీతమ్మధార: దక్షిణ నియోజకవర్గ పరిధిలో అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీవీఎంసీ 27వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ పనులు చేపట్టిన సమయంలో యూజీడీ పైపులైన్లు పాడయ్యాయి. ఈ సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వాసుపల్లి ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్య పరిష్కారానికి నీటిసరఫరా విభాగ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో రూ.19.90 లక్షల వ్యయంతో పనుల ప్రారంభానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు చేపడుతున్నామన్నారు. భగత్‌సింగ్ సచివాలయం పరిధిలోని డే అండ్ నైట్ హాస్పిటల్ ప్రాంతంలో రూ.7.30 లక్షలతో, శ్రీనగర్ ఏరియాలో రూ.6.70లక్షలతో , పబ్లిక్ లైబ్రరీ ప్రాంతంలో రూ.5.90 లక్షలతో యూజీడీ పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర రెడ్డి, స్టేట్ డైరెక్టర్ పద్మనాభ అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట, సింహాలదేవిడి, సీబీఎం స్కూల్, ఆర్‌వో స్ట్రీట్ ప్రాంతాల్లో రూ.23 లక్షల వ్యయంతో తలపెట్టిన సీసీ డ్రైన్లు మరమ్మతు పనులకు సోమవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఈ మహ్మద్, వర్క్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపి, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, వేగి వెంకటప్పారావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 32వ వార్డు దేవాంగులవీధి, నేరెళ్ళకోనేరు ప్రాంతాల్లో సీసీ డ్రైన్ల మరమ్మతులకు ఎమ్మెల్యే వాసుపల్లి , కార్పొరేటర్ కందుల నాగరాజు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మూలె రామిరెడ్డి, బంగారమ్మ, బోణి దేవ, బొడ్డేటి కిషోర్, బాబుల్ శ్రీను, కోటి కుమారి, కృష్ణవేణి, భానుమూర్తి పాల్గొన్నారు.

రూ.12లక్షలతో వార్డు కార్యాలయం అభివృద్ధి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కార్యాలయాన్ని రూ. 12.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్టు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు పూర్ణామార్కెట్‌లోనే వార్డు కార్యాలయం ఉండడం వలన కార్యాలయం పనుల కోసం ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. సిబ్బంది కనీసం కూర్చునే వీలు కూడా లేకపోవడంతో, దీనిపై మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఆమె రూ. 12.50లక్షలు నిధులు విడుదల చేయడంతో జనతాబజార్ వద్ద జీవీఎంసీకి చెందిన ఓ భవనాన్ని మరమ్మతులు చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని విల్లూరి వివరించారు. ఇందులో భాగంగానే సోమవారం అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు, కంటిపల్లి వరలక్ష్మి, యాల రమణమ్మ, ఇంజినీరింగ్ ఏఈ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్లస్టర్ల వారీ సమావేశాలు

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఈ నెల 7 నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమావేశం కానున్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్లస్టర్–1 పరిధిలో గల 27, 31, 32, 42 వార్డులకు సంబంధించిన నాయకులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్లస్టర్–2 పరిధిలోని 28, 29, 30, 37 వార్డుల నాయకులతో సమావేశమవుతారు. 8న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్లస్టర్–3 పరిధిలో గల 36, 38, 39 వార్డుల నాయకులు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్లస్టర్–4 పరిధిలో గల 33, 34, 35, 41వార్డులకు సంబంధించిన నాయకులతో సమావేశం కానున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం ఉదయం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రజా రవాణా మేలు



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం స్పందనతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా వారంలో ఒక్క రోజు ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను ఉపయోగించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వెలంపేట నుంచి విజయేంద్ర వ్యాయామశాల వరకు రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ. 20లక్షలు కేటాయించడంతో వీధుల్లో ఉన్న కాలువలు, రోడ్లు, కల్వర్టులు, యూజీడీ వంటి పనులు చేపడుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 35వ వార్డులో పూర్ణామార్కెట్‌తో పాటు అన్ని వీధులు అభివృద్ధి చేశామని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు.

సీపీఐ నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

మహారాణిపేట: జగనన్న ఇళ్ల నిర్మాణాలకు అయిదు లక్షల రూపాయలను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. టిడ్కో గృహాలను తక్షణం లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహ్మాన్, కసిరెడ్డి సత్యనారాయణ, చంద్రశేఖర్, ఈశ్వరరావు, టిడ్కో, జగనన్న కాలనీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్‌తో విద్యార్థుల్లో నైపుణ్యవృద్ధి



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ ఎంతో దోహదపడతాయని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌పై 12ల కళాశాలల అధ్యాపకులకు లెర్నింగ్ మేనేజ్‌మెంట్ విధానంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. అనంతరం ఆయా కళాశాలల విద్యార్థులు నైపుణ్యం సాధించేలా శిక్షణ పొందిన అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ పి.వాణి, అప్రెంటిస్‌షిప్ కో–ఆర్డినేటర్లు రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్లు జి.శ్రీనివాసరావు, సిహెచ్.లలిత, కె.రవిబాబు పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



త్రిమూర్తులుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కిడ్నీ రోగికి ఆర్థిక సహకారం అందించి, అండగా నిలిచారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కిలాని త్రిమూర్తులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. డయాలసిస్ తప్పనిసరి అయి, మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి, త్రిమూర్తులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నీలాపు లక్ష్మి, పార్టీ నాయకులు బెవర మహేష్, కోరాడ సురేష్, అడపా శివ తదితరులు పాల్గొన్నారు.

'వార్డుల్లో పెండింగ్‌లో అభివృద్ధి పనులు'

డాబాగార్డెన్స్: వార్డుల్లో వందల సంఖ్యలో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, తన వార్డులో అదే పరిస్థితి అని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో 120 అంశాలు అజెండాలో చేర్చారని, గత శనివారం నిర్వహించి స్టాండింగ్ కమిటీ సమావేశంలో 105 అంశాలు చేర్చారన్నారు. వార్డుల్లో రోడ్లు, కాలువలు, డ్రైనేజీ సమస్యలున్నాయని, వాటిని వదిలేసి 57 శ్మశానవాటికల అభివృద్ధికి రూ.33 కోట్లు వెచ్చించడం తగదన్నారు. ఫ్లోర్ లీడర్ భీశెట్టి మాట్లాడుతూ తన వార్డులో సోమవారం చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పిలవకపోవడం అన్యాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ వచ్చి పాలన చేస్తే ట్రాఫిక్‌తో పాటు కాస్ట్ ఆఫ్ లివింగ్ పెరుగుతుందని, అందుకే రాజధాని వద్దని చెప్పారు.

కాన్‌స్టేబుల్ పరీక్షల్లో స్టడీ సర్కిల్ అభ్యర్థుల ప్రతిభ



పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులతో గంగారావు

డాబాగార్డెన్స్: పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో అల్లూరి స్టడీ సర్కిల్ అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. స్టడీ సర్కిల్ నుంచి 12 మంది అర్హత సాధించడంపై అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఇదే స్ఫూర్తితో శ్రమించి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. తాజాగా విడుదలైన గ్రూప్–1 పరీక్షలోనూ స్టడీ సర్కిల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించినట్టు తెలిపారు. ప్రస్తుతం గ్రూప్–2 శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 80084 12798కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం మేనేజర్ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షార్థులకు పుస్తకాల పంపిణీ



సైన్ ఇండియా మ్యాగజైన్ అందిస్తున్న రాజేష్

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదువుతున్న అభ్యర్థులకు సైన్ ఇండియా మ్యాగజైన్ ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కర్రి రాజేష్ అన్నారు. టౌన్‌హాల్ ప్రాంతంలో, లైబ్రరీ సమీపంలో సుమారు 150మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన మ్యాగజైన్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. నిరుద్యోగుల కోసం గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఈ పుస్తకాలను ప్రచురించినట్లు తెలిపారు. రాజేష్, రమణలకు పరీక్షార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కేజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: కేజీహెచ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ కార్యకర్తలు సోమవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించే కేజీహెచ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎంపీపీ చంద్రమౌళి, ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు, కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాలు సమర్పించారు.

ఫేస్ యాప్‌పై అంగన్‌వాడీల ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సీతమ్మధార: అంగన్‌వాడీ సిబ్బందికి ఫేస్ ఐడెంటిఫికేషన్ యాప్‌ను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అర్బన్–1,2 పెందుర్తి, భీమిలి ప్రాజెక్టుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని, లేకుంటే చలో అసెంబ్లీ నిర్వహిస్తామని తెలిపారు. ధర్నా శిబిరం వద్దకు అర్బన్–2 సీడీపీవో శ్రీలత రావడంతో, ఆమెకు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, నాయకులు పి.మణి, ఆర్.శోభారాణి, కె.పంద్మావతి, వెంకటలక్ష్మి, భవానీ, బి.ఈశ్వరమ్మ, ఆదిలక్ష్మి, పాపవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం



జోన్–2 కార్యాలయంలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



గౌరీ డిగ్రీ కళాశాల సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, వినియోగదారులు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట కార్యాలయం, ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితర సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. విద్యుత్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలపై 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. అనంతరం సబ్ డివిజన్‌లో ఏఈ, డిప్యూటీ ఈఈ, ఈఈలతో సత్యనారాయణ, కోటేశ్వరనాయుడు సమావేశం నిర్వహించారు. సదస్సులో అందిన విద్యుత్ ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు ఆదేశించారు. సమావేశంలో ఫోరం మెంబర్ హరిబాబు, ఇతర అధికారులు, గౌరీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు.. గృహాల సందర్శన తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలో ఉన్న గృహాలను తప్పనిసరిగా సందర్శించి, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆశా కార్యకర్తలకు 6, 7 మాడ్యూల్స్‌పై శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల వివరాలను 12 వారాలలోపు నమోదు చేయాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో 108 వాహనాల ద్వారా సమీప ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.ఉమావతి, సత్యవతి, కె.ధర్మేంద్ర, ఇతర అధికారులు వై.స్వర్ణలత, లక్ష్మి, మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు లోకేష్ మాటలు'



మాట్లాడుతున్న మహమ్మద్ సాధిక్

అల్లిపురం: టీడీపీ నేత నారా లోకేష్ ముస్లిం మైనార్టీల గురించి మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు మహ్మద్ సాధిక్ ఎద్దేవా చేశారు. నారా లోకేష్ పాదయాత్రలో చిత్తూరు జిల్లా ఐరాలో నిర్వహించిన ముస్లిం మైనార్టీ సమావేశంలో మాట్లాడిన విషయాలపై సాధిక్ స్పందించారు. ఈ మేరకు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.2,665 కోట్లు ఖర్చు పెడితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2022 వరకు మూడు సంవత్సరాల్లో రూ.21వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నాలుగున్నర సంవత్సరాలు ముస్లిం మైనార్టీలకు మినిస్ట్రీ ఇవ్వలేదన్నారు. అప్పుడు ముస్లింలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో నారా హమారా కార్యక్రమంలో హక్కు అడిగిన ముస్లిం మైనార్టీ యువతపై దేశ ద్రోహం కేసు పెట్టింది నిజం కాదా? అని నిలదీశారు. ముస్లింలకు కావాల్సింది అభివృద్ధి, సంక్షేమమేనని, అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. దేశంలోనే తొలిసారిగా ముస్లిం మైనార్టీ సబ్ ప్లాన్ తీసుకొచ్చి అసెంబ్లీలో ఆమోదించిన ఘనత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానిదేనని ఆయన గుర్తు చేశారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



రక్షణగిరి వెళ్లే మార్గంలో చెత్త తొలగింపు చర్యలు పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిసరాల్లో ఎట్టకేలకు చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. జోన్–5 కార్యాలయం ఆనుకుని ఉన్న బాబుకాలనీ, కొండవీధి, జేఎస్ఎస్ఆర్‌యూఎం కాలనీ, జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారుల్లో చెత్త పేరుకుపోయింది. పాత లారీ యార్డ్ ప్రాంతంలో వాహనాలు నెలలు తరబడి వదిలేయడం, రక్షణగిరి సెయింట్ పీటర్స్ చర్చికి వెళ్లే మార్గంలో చెత్త వేసేస్తున్నారు. ఇక్కడి సమస్యలపై సాక్షి దినపత్రికలో సోమవారం 'జ్ఞానాపురంలో అపారిశుధ్యం'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ స్పందించి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం పారిశుధ్యం సిబ్బంది చెత్త తొలగించి తుప్పుపట్టిన డంపర్‌బిన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.

వార్డుల్లో పరిశుభ్రతే లక్ష్యం



పాత పోస్టాఫీసు వద్ద చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి వార్డులో పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన పూర్ణామార్కెట్, పాత పోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా సంకల్పంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయాన్నే చెత్తను యార్డులకు తరలించాలన్నారు. బ్లాక్‌స్పాట్లలో చెత్త ఉండకుండా చూసుకునే బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఉందన్నారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా వార్డుల్లోని ప్రతి ఇంటికి వెళ్తే చెత్త బయటకు రాదన్నారు. ఇళ్ల వద్దకు వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో రోడ్డుపై వాహనాలు నిలిపి పారిశుద్ధ కార్మికులతో చెత్తను సేకరించాలన్నారు.

'స్పందన'సమస్యలకు తక్షణ పరిష్కారం

స్పందన కార్యక్రమానికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్సీ కె.శివప్రసాద్ సూచించారు. సోమవారం జోన్–4 కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. యూసీడీకి 1, రెవెన్యూకు 2 సమస్యలపై వినతులు వచ్చాయి. వాటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని జెడ్సీ తెలిపారు.

వర్సిటీకి విద్యార్థులే గర్వకారణం



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ముగ్గురు జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీకి చెందిన జె.వాసు, వి.ఎస్.ఎన్.లక్ష్మణ్, పి.రమ్య గత నెల 1 నుంచి 25వ తేదీ వరకు ఢిల్లీలో శిక్షణ పొంది 26న నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్రపతి అవార్డు సాధించిన ధనియాల సాయిని కూడా ఆయన అభినందించారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు పెరేడ్ విశేషాలు, ఢిల్లీలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసిన సందర్భాలను వివరించారు. విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా విద్యార్థులు నిలుస్తున్నారని వీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఐటీఐ సమన్వయకర్త డాక్టర్ పి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో ప్రపంచ శాంతి



వ్రతం నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: యజ్ఞాలు, యాగాలు, క్రతువులు ప్రపంచ శాంతికి వారధుల లాంటివని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా ఆయన 108 మంది దంపతులతో సామూహిక శ్రీరామదేవుని వ్రతం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పే యజ్ఞాలు భారతీయ సనాతన సంస్కృతిలో భాగమన్నారు. సమాజానికి మంచి చేసే ఆ సంస్కృతిని ప్రతిఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ ఈ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు.